కథాపేటిక

# మరీచిక

## - డా. కసిరెడ్డి

''మా అమ్మాయికి విడాకుల నోటీసు పంపించావో శాల్తీ గల్లంతయితదీ...''

అత్త రాజేశ్వరి అరుపుతో అంతవరకు నిలబడ్డ వాడల్లా చెట్టునుండి రాలిపడ్డ పువ్వులా, చెవి నుండి రాలిపడ్డ కమ్మలా, భవనం మీదినుండి జారిపడ్డ కూలీలా కుప్పకూలిపోయాడు గిరిజానన్.

ముచ్చెమటలు పోశాయి. చూపు నేలలోకి తప్ప మరోవైపే లేదు.

''నీ ముఖం ఈ ఇంటివైపు తిప్పితే ఇక ఇంతే సంగతులు'' మూతిలో పొడిచేంత పని చేసింది భార్య మహేశ్వరి.

''నేనేమిటో తెలుసుకదా'' చెప్పులో కాలుదూర్చి చెప్పుకాలితో నేలను తాటిస్తూ, అరేయ్ నీకు చెప్పు దెబ్బలు తప్పవురా అన్నట్టుగా వెళ్లిపోయాడు...మామ సోమసుందరం.

తొట్టెల్లోని ఆర్నెల్ల పాప కెవ్వున ఏడ్పి ఆలాపన అందుకొంది ''ఒరే నాన్నా నాలాగన్నా ఏడ్చే స్వాతంత్ర్యం కూడా నీకు లేదాంట్రా'' అన్నట్టు.

అత్త చంపుతానన్నది, భార్య ఇంతే సంగతులన్నది, మామ చెప్పుదెబ్బలన్నాడు, తొట్టెలోని పాపకు మహాట్ట హాసం చేయడం రాదు కాబట్టి తనతో శ్రుతి కలుపంటూ ఏడుపు లంకించుకొంది.

• • •

తానొక్కడు, ఒంటరి బ్రతుకు.

పుట్టుకలోనే అమ్మపోయింది, నాలుగేళ్లొచ్చేవరకు నాన్నపోయాడు. ఒక అన్న గ్రామ పంచాయతీలో కారోబార్, మరోఅన్న పంచాయితీ సమితిలో పంతులు. ఇద్దరన్నల పెళ్లిళ్లయ్యాయి. వదినలు పదహారు-పద్దెనిమిదిల్లో ఉంటే అన్నలు ఇర్వై ఇర్వై రెండుల్లో ఉన్నారు.

తాను వాళ్ల పాలబడ్డాడు, పానకంలో పుడకలా, పంటికింది రాయిలా, పట్టె మంచం మీది కొరివిలా!

పలకరింతకు మారుగా దులపరింత, అన్నానికి మారుగా సున్నం, మృదువు పలుకుకు మారుగా ములుకు పలుకు. నిమిరేవాళ్లకు మారుగా బెత్తాలతో భజన, ముద్దులకు మారుగా పిడిగుద్దులు, సత్కారానికి మారుగా ఛీత్కారం, కళ్లల్లో ఇంకని జలపాతం, ప్రేవుల అరుపుల్లో శబ్దబ్రహ్మ సాక్షాత్కారం.

విషాదహేలలో అయిదో తరగతి అయిపోయిందని పించింది. ఆరవ తరగతి నుండి పదవతరగతి వరకు సాంఘిక సంక్షేమ వసతి గృహంలో భోజనం, సర్కారుబడిలో అధ్యయనం.

అన్నలు వదినలు పీడ విరగడయ్యిందనుకొన్నారు. తమ బడిలో పడని గిరిజానన్‌ను శాశ్వతంగా బడికే అంకితం చేసేసి అమ్మయ్య అని ఊపిరి పీల్చుకొన్నారు.

తల్లిదండ్రులు పోతే అన్నావదినలు అంతవారై తీర్చిదిద్దుతారన్న మాటలు తన విషయంలో వమ్మయి పోయినై. కుటుంబ జీవన మర్యాదలు చెరువులో పిసికిన చింతపండులా, కిరోసిన్‌లో సగం కాలిన వధువులా, సారామత్తులో కుప్పకూలిన కుటుంబంలా చిందరవందరైనై- కకావికలైనై- కంగాళీ అయినై.

పదవతరగతి వరకు వసతిగృహమే దిక్కయ్యింది. ఏ పండక్కో పబ్బానికో ఇంటికి వెళ్లినా అక్కడ అన్నా వదినల చీవాట్లు, పిడిగుద్దులు ఏదోవిధంగా తనకి తప్పేవికావు. ఆ సెలవుదినాల్లో కడుపునిండా తిండి కూడా దొరికేదికాదు. పురుగులన్నమో, పుచ్చిపోయిన కూరలో హాస్టల్లోనే కడుపు నిండేది.

ఆ తర్వాత ఇంటర్మీడియెట్ నుండి ఎం.ఏ వరకు హైదరాబాదులో స్కాలర్‌షిప్పులతో, హాస్టళ్ల భోజనంతో గడిచిపోయింది. ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఏ




తర్వాత ఎం.ఫిల్, పిహెచ్.డి పూర్తయినై. హాస్టల్ గదుల్లో వందలమందితో పరిచయం, గ్రంథాలు, గ్రంథాలయాలు ఇంత సన్నిహితమైనాయని చెప్పలేం! అవే జీవనమైపోయినై. తనకు ప్రొఫెసర్ల ముందు గుర్తింపూ వచ్చింది. ఆ గుర్తింపే ఒకటి రెండు కళాశాలల్లో ఉద్యోగం ఇప్పించింది. చివరకు యూనివర్సిటీలోనే ఉద్యోగం దొరికింది.

తన చేతిలో కావాల్సినంత డబ్బు ఆడుతున్నది. ఉద్యోగం దొరకనంతవరకు ఒకరు పెడితే తాను తినాల్సివచ్చింది. ఉద్యోగంలో చేరిన తర్వాత తన ఇష్టం వచ్చినప్పుడల్లా తిన్నాడు, తిరిగాడు, సినిమాలు చూశాడు, సెలవుల్లో దేశమూ తిరిగి వచ్చాడు.

అనేక సందర్భాల్లో తానీ ప్రపంచంలో ఒంటరిని అనే భావం మెదిలింది. ఊరుంది, ఊరిలో ఇల్లుంది, ఇంటి మంచి చెడ్డా అన్నలూ-వదినలూ చూస్తున్నారు. వారికి పిల్లలున్నారు. పెద్దన్న కూతురు పెళ్లి కూడా అయ్యింది. చుట్టపు చూపుగా తనకు పిలుపు వస్తే వెళ్లి వచ్చాడు. అన్నకూతురి పెళ్లిళ్లో కూడా తాను కడుపునిండా తినలేదు.

'తల్లి కడుపు సూత్తది-పెళ్లాం జేబు చూస్తది' కడుపు చూచే తల్లిలేదు, జేబులు వెతికే పెళ్లాంలేదు.

ఉద్యోగం దొరికి నాలుగేళ్లయినా తాను పెళ్లి



చేసుకోలేదు. పోనీ ఏ అన్న అయినా, ఏ బంధువైనా పెళ్లిచేసుకోరా పలానావారి అమ్మాయుంది అని అలవోకగా కూడా అడగలేదు. ఇంకేం అన్నలు-ఇంకేం బంధువులు.

తాను ఎం.ఏ చదివేకాలంలో ఓ అమ్మాయంటే ఇష్టముండేది. తానా అమ్మాయిని పెళ్లిచేసుకొమ్మని అడిగితే! అడిగితే ఆమె సరే అంటే! ఇల్లెక్కడా! ఇంటికి కిరాయి ఎక్కడా! తననే పోషించుకోలేనివాడు ఆమెను పోషించేదెట్లా! బిచానా-రికానా లేనివారికి పెళ్లెందుకు! అలా ఆ ఆలోచనను ఎనిమిదేళ్లు తరిమేశాయి.

ఉద్యోగం దొరికిం తర్వాత నాల్గోయేట మళ్లీ ఆలోచన. పెళ్లి ఆలోచన. తాను వండుకొని తింటు న్నాడు, హోటల్లోనూ తింటున్నాడు. బజార్లో బండి మీద కొనుక్కొని తింటున్నాడు. అన్నావదినల ఇంట్లోకాని, హాస్టల్లో కాని తన ఆకలి ఎన్నడూ తీరలేదు. ఎపుడూ కడుపు వెలితిగా ఉండేది. ఇప్పుడు తన శ్రమశక్తితో వచ్చిన డబ్బుతో తింటున్నాడు, కడుపునిండా తింటున్నాడు. కంటినిండా నిద్రపోతున్నాడు. కాని ఆ నిద్రలో పిచ్చి పిచ్చి కలలు కంటున్నాడు.

తానూ తన భార్య ఊటీలో విహరిస్తున్నట్లు, కొడైకెనాల్లో తిరుగుతున్నట్లు, సిమ్లా కాటేజీల్లో కేరింతలు కొడుతున్నట్లు, కాశ్మీర్లో బోటు షికారు చేస్తున్నట్లు... తియ్యటి కలలు. తాము హంసలు, తాము అశ్వాలు, తాము ఏనుగులు, తాము పావురాలు.

ఎవరీ స్వప్నసుందరి! కలలు కల్లలు.

తనకు చిన్నపాటి బొర్ర కూడా వచ్చేస్తుంది. వ్యాయామం చేయాలంటే శరీరం వంగదు, పొద్దున్నే ఓ మైలు తిరిగి రావాలంటే కూడా బద్ధకమే.

తాను బద్ధక బ్రహ్మ అయిపోతున్నాడు. తత్త్వ శాస్త్రంలో తాను శబ్దబ్రహ్మ, అక్షరబ్రహ్మ, జ్యోతి ర్బ్రహ్మ, నాదబ్రహ్మ, ఆనందో బ్రహ్మ అని విన్నాడుగాని ఈ బద్ధకబ్రహ్మ వినలేదు. బ్రహ్మ చైతన్యానికి ప్రతీక అయితే, బద్ధకం జడానికి ప్రతీక.

ఎంత బాగుంది ఈ పదబంధం. తనకెవడన్నా ఈ బిరుదిస్తే ఈడ్చి లెంపకాయ కొట్టేవాడు, ఒకడిచ్చే దేమిటి! తనకు తానే ఇచ్చుకొంటుంటే!

ఉలిక్కిపడ్డాడు, జీవితం కలలకు పరిమితమై పోవడానికి వీల్లేదని నిశ్చయించుకున్నాడు. ఆరోజు పత్రికలో కనిపించిన ఓ 'వరుడు కావలెను'కు దరఖాస్తు చేసుకొన్నాడు.

ఆ చిరునామా హైదరాబాదుదే! రెండే రెండు రోజుల్లో పెళ్లిళ్ల బ్రోకర్ రానేవచ్చాడు. ఆ అమ్మాయిది తమ కులమే, ఆ కులాన్ని చూసే తాను దరఖాస్తు చేశాడు. కాకపోతే తాను పుట్టిపెరిగింది తెలంగాణాలో, ఆమె పుట్టిపెరిగింది కోస్తాలో. వాళ్ల కుటుంబం హైదరా బాదులోనే సెటిలైపోయింది. ఇంకేం అత్తగారి ఇల్లు హైదరాబాదులో! తన ఉద్యోగం హైదరాబాదులో!

ఈ వండుకోడం, హోటల్లో తినడం, బజారు బండ్లల్లో మెక్కడం! ఇక స్వస్తి.

• • •

మహేశ్వరితో పెళ్లయింది. తను అయిదడుగుల ఎత్తు, ఒత్తుగా జుట్టు, బొద్దుగా మనిషి, బూరెల బుగ్గలు, ఒత్తు కనుబొమ్మలు, కాకపోతే చిన్నపాటి బుర్ర. తను అందగాడే! అబ్బ! అద్దంలో చూచుకొంటే తన బుగ్గలు నిగనిగ మెరుస్తుంటాయి. తనకు తానే ముద్దొస్తుంటాడు. తనది సినిమా హీరోంత మంచి అందం. ఛస్! వెధవా పనికిమాలిన సినిమా నాయకునితో పోల్చుకొంటావా! నీకు నీవేసాటి! మనస్సు అలా తకబికలాడేది.

మహేశ్వరిది శిల్పాకృతి. తనకు చెవుల వరకు ఉంటుంది. రామప్ప గుడిలోని నాగిని కాదుగానీ, ఎందుకంటే నృత్యం రాదు. అయినా రమణీయాకృతే! బిఎస్సి పూర్తి చేసింది. ఏదైనా ఉద్యోగం చేయాలని ఉబలాటపడుతుంది. తండ్రి ఏదో మందుల కంపెనీలో పనిచేస్తున్నాడు. తల్లి ఇంటిదగ్గర అప్పడాలు ఒత్తుతుంది. ప్యాక్ చేసి పక్క దుకాణానికి పంపుతుంది.

రెండే రెండు గదుల సొంత ఇల్లు. ఇంటిముందు

## బంగారు కొండ

ప్రపంచంలో ఎన్నో కొండలు వున్నాయి. కానీ బంగారం వెళ్లగక్కే కొండ మాత్రం ఎక్కడా లేదు. కానీ కొలంబియా అగ్నిపర్వతం మాత్రం రోజుకొక్కింటికి సుమారు అరకిలో బంగారాన్ని వెళ్లగక్కుతుంది. ఈ అగ్నిపర్వతం నుండి గత 5,60,000 సంవత్సరాల నుండి ఏటా ఎంతో కొంత బంగారం బయటకు వస్తూనే వుంటుంది. ఇదేవిధంగా ప్రతిదినం ఈ కొండనుండి బంగారం వెళ్లగక్కబడినా మరో అయిదులక్షల సంవత్సరాల కాలం వరకు ఈ అగ్నిపర్వతంలో వున్న బంగారపు నిల్వలకెలాంటి కొరత వుండదని పరిశోధకులు తెలియచేస్తున్నారు.


## ఉప్పు తెచ్చే ముప్పు

వయసు పెరిగేకొద్దీ శరీరంలో ఎముకలు శక్తిహీనమైపోయి, బలహీనంగాను పెళుసుగాను తయారవుతుంటాయి. ఈ పరిస్థితికి కారణం మనం ఆహారంలో తీసుకునే ఉప్పు. అందువలన మనం తీసుకునే ఆహారంలో ఉప్పు తగ్గించాలి. అందువలన వృద్ధాప్యంలో ఎముకలకు సంబంధించిన బలహీనతలు రావు. ఇంతే కాక ఇతరత్రా కూడా ఉప్పు తగ్గించటం వలన ఉపయోగాలుంటాయి.

## మాట్లాడే కారు

సింగపూర్‌లోని నార్మన్‌టేన్ అనే టాక్సీ డ్రైవర్‌కు మాట్లాడే కారు వుంది. ప్రయాణీకులు కారు డోర్ తెరిచి లోపలకు అడుగు పెడుతుండగానే అది హలో అంటూ పలకరిస్తుంది. ఆ తరువాత వారు దిగిపోతున్నపుడు గుడ్‌బై చెప్పడంతోపాటు ఏమైనా వస్తువులు మర్చిపోయారా? అంటూ గుర్తు చేస్తుంది. ఈ కారులో ఈ మాటలన్నీ కూడా హారన్ నుంచి వస్తాయట.

\- శ్రీకొండ




రెండు గదుల ఖాళీ జాగా. భార్యతో పదిరోజులు కూడా ఆ ఇంట్లో ఉండాలనిపించలేదు. అత్తామామలతో ఉన్న ఆ యింటికన్నా తన ఒక్కగదే భూలోకస్వర్గ మందిరమనిపించింది. పదహార్ల పండగ దాటిన వెంబడే ఆ గదికి బిచానా ఎత్తేశాడు. భార్యతోపాటు అత్తా వచ్చింది. ఏవేవో తెచ్చింది. వంటా వార్పూ చూచింది. వెళ్లిపోయింది, మరుసటిరోజు వచ్చింది. మళ్లీ వంటావార్పూ చూచింది. వెళ్లిపోయింది. అలా నెలంతా వచ్చింది. ఆమె చేతి వంట నచ్చక, ఆమె కళ్లుగప్పి తానూ తన భార్యా రాత్రిపూట హోటల్లో కూడా తినడం ప్రారంభించారు.

అలా పెళ్లయి నెల గడిచింది. ఈనెలలోనే మరో రెండుగదుల ఇంటికి తాను మారాడు. అత్తగారు నిరంతరం తమ యోగక్షేమాలు చూస్తున్నది. జీతం తీసుకొని తాను ఇంటికి వస్తూ పుల్లారెడ్డి స్వీట్లు కొన్నాడు. ఆనందంతో ఇంటికి వచ్చాడు. అత్తగారింట్లోనే ఉంది. ఆమెకూ స్వీట్లిచ్చాడు. భార్యకూ ఇచ్చాడు. జీతం డబ్బులు అలా టేబుల్‌మీద పెట్టి కూచున్నాడు.

అత్తగారు వచ్చి ఆ జీతం డబ్బులు తీసుకొంది. ''ఈనెలంతా అదో ఇదో నాచేత ఖర్చు చేస్తున్నాను గదా! అందుకే తీసుకొంటున్నాను. నీ ఖర్చులకు రెండొందలుంచేసుకో!'' అని రెండొందలు టేబుల్ మీద పెట్టి వెళ్లిపోయింది.

''మన పెళ్లి తర్వాత, మనకొరకు అమ్మ ఎంతో ఖర్చుపెట్టింది'' అన్నది మహేశ్వరి తన మెడచుట్టూ చేతులు వేసి.

''అవును. అవును'' అంటూ తాను మహేశ్వరిని వదలి వెళ్లిపోయాడు.

అలా అయిదారునెల్లు తన జీతం ఏదోవిధంగా అత్త చేతుల్లోకి వెళ్లిపోతుంది. తన అత్తగారు డబ్బు సంపాదన గురించి, డబ్బు భద్రత గురించి అంతర్జాతీయ స్థాయిలో మాటాడుతుంది.

ఆ యిల్లు సరిపోక తాను మళ్లీ ఇల్లు మారాడు. ఇది మూడుగదుల ఇల్లు. ఈ ఇంట్లోకి అత్తామామా వచ్చేశారు. తానడక్కముందే ఆ రెండు గదులు కోర్టు కేసులో ఇరుక్కొన్నాయి, తప్పనిసరిగా ఖాళీ చేయాల్సి వచ్చింది. కోర్టులో గెలిస్తేనే ఆ గదులు దక్కుతాయి అన్నది అత్త రాజేశ్వరి. తాను కిమ్మనలేదు.

తన మామ మంచి మాటకారి. ఇంగ్లీషు అనర్గళంగా మాటాడుతాడు. భారతదేశానికి తానే హోంమంత్రినైతేనా దేశం రూపురేఖలే మారిపోతై అని లెక్చర్లు దంచుతుంటాడు.

అలా అత్తామామ ఓగదిలో, తానూ తన భార్య ఓ గదిలో, మరోగదిలో వంట. కాలం గడుస్తుంది. తనకో ఇద్దరు బావమర్దులున్నారు. వాళ్లిద్దరూ మహేశ్వరికన్నా పదేళ్లు పెద్దవాళ్లే. పెళ్లయ్యేవరకు మహేశ్వరికి పాతికయితే, తనకు ముప్పయి. నెల నెలా ఖర్చులు పెరిగినై. తన జీతం ఏదోవిధంగా అత్తగారి చేతుల్లోకి వెళ్లిపోతుంది. తనకు బ్యాంకు బ్యాలెన్సు ఏబయివేల వరకు ఉంది. భార్య మహేశ్వరి ఆ నొప్పి ఈనొప్పి అంటూ మందులకు డబ్బు లాగు తుంది. తల్లి కూతుళ్లిద్దరు డాక్టరు దగ్గరకు వెళ్లివస్తారు. ఇంత బిల్లయిందంటారు. పెళ్లయి ఏడాది తిరిగేవరకు తన బ్యాంకు బాలెన్సు పాతికవేలకు పడిపోయింది. మహేశ్వరి గర్భవతి. తాను తండ్రి కాబోతున్నాడు. పళ్లు పాలు పుష్టికర ఆహారం. మహేశ్వరి కొరకు తానేమేం తేలేదని! ఎంత ఖర్చు చేయలేదని. మహేశ్వరి నిండుగా పుష్టిగా ఉంది. తన సంతానం అలాగే ఉంటుంది. తానూ అలాగే ఉన్నాడు. తన జేబు చిక్కుతున్నది, బ్యాంకులో చెక్కుబుక్కు చిక్కు తున్నది. తన రంగు కూడా కొద్ది కొద్ది మారిపోతున్నది.

అయితేనేం తాను తండ్రి కాబోతున్నాడు. ఓరోజు తండ్రి అయ్యాడు. ఆనందంతో తన కొలీగ్స్‌కు స్వీట్లు పంచాడు. టీపార్టీ ఇచ్చాడు. మహేశ్వరి ఆసుపత్రి నుండి ఇంటికి వచ్చేవరకు అయిదువేల ఖర్చా వచ్చింది. అయితేనేం తాను తండ్రి అయ్యాడు. ఇలా పదిమంది పిల్లలకు కావాలి. 'బెత్తెడు జీతం బారెడు ఖర్చు'... 'చస్తావు కొడుకా' అని మనస్సు హెచ్చరించింది. అప్పటికి మనస్సును తొక్కపట్టేశాడు.

పాప పుట్టి ఆర్నెల్లయింది. పెళ్లయి రెండేళ్లు గడచిపోయినై.

గత రెండుమూడు నెలలుగా తాను అత్తగారి చేతికి పైసా ఇవ్వలేదు. ఖర్చులు తానే చూస్తున్నాడు.

''నెల జీతం తెచ్చి మా అమ్మకివ్వండి. ఈ సాదర సామాను బాదరబందీ అంతా మీకెందుకు. అన్నీ ఆమె చూచుకొంటుంది'' అంది మహేశ్వరి ఓరోజు.

''మీ తల్లిదండ్రులు ఇక్కడ అవసరం లేదు'' తాను మొదటిసారి మహేశ్వరి నెదిరించాడు.

మహేశ్వరి కళ్లల్లో ఎరుపు జీరలు. తానక్కడ నిలబడలేక వీధిలో పడ్డాడు. ఓ సినిమా హాల్లో దూరాడు. ఓ హోటల్లో తిన్నాడు. రాత్రి పదిగంటలకు ఇంటి గడప ఎక్కాడు. తన గదికి భార్య రానేలేదు. పిలిచినా రాలేదు. ఆమె అత్తామామల గదిలోనే ఉంది.

ఆరోజు రాత్రి తన గొంతునెవరో పిసుకుతున్నారు. ఒక్కరుకాదు ఇద్దరు. రెండూ దయ్యాల్లా ఉన్నాయి. ఒక దయ్యంలో అత్తపోలికలు... మరో దయ్యంలో భార్య పోలికలు... వాళ్లను తాను ఎదిరించలేకపోయాడు. తాను చచ్చాననుకొని కొండమీద నుండి త్రోసేశారు...తాను భయంతో కెవ్వున కేకవేశాడు. కళ్లు విప్పేవరకు తాను మంచం పైనుండి పడి ఉన్నాడు. తలకు చిన్నపాటి దెబ్బ కూడా తగిలింది. పీడకల...

ఈ పీడకల నిజమైతే- అమ్మబాబోయ్ అనుకొన్నాడు

తాను. ఆ మరుసటిరోజు అత్తామామలు వెళ్లి పోవాల్సిందే అని పట్టుపట్టాడు తాను.

తల్లీబిడ్డలు ఒక్కటై తనను చెడామడా తిట్టేశారు.

''జాగ్రత్తరా అల్లుడా! హోంమంత్రి పి.ఎ నాచుట్టం'' అంటూ గొల్లపూడి ఫోజు పెట్టి వెళ్లిపోయాడు మామ సోమసుందరం. తన అన్నకూతురు పెళ్లి వార్త వచ్చింది. తనకు అన్నం ముద్ద పెట్టడానికి వెనకాడిన అన్న! అన్న కూతురైతేనేం తన కూతురు కాదా!

''ఆ అమ్మాయికి చీర తీసుకొని వెళ్లి పెళ్లికూతురును చేసివద్దాం'' అన్నాడు తాను భార్యతో.

''నేను రాను మీరు వెళ్లండి'' అంది మహేశ్వరి.

తన పెట్టెలోని ఓ చీర తెచ్చిచ్చింది. ''ఇది పాతదే అయినా పట్టుచీర. డబ్బులు పారబోసి కొనకండి. అయిదు వందలు నాకే ఇవ్వండి. ఇవాళ రెండువేలు పెట్టినా ఇలాంటి చీర రాదు'' అంది భార్య. ఆ చీరను విప్పిచూశాడు. దానిని జెల్లలు నాక్కెై. తన భార్యమీద కలిగిన అసహ్యము ఆగ్రహం తారామం డలాన్ని తాకింది.

''ఇదో చీర...నాదో బతుకు'' అంటూ తాను విసిరికొట్టాడు.

''నాచీరను విసిరికొట్టినా, నా బతుకును తిట్టినా... నేనేమనుకోను.. గానీ..రెండువందల చీర తీసుకొని వెళ్లి కాలపెట్టిరండి...'' అంది పరమ వెటకారంతో మహేశ్వరి.

''కుటుంబంలో ఉండాల్సిన ఆడదేనా...'' అన్నట్లుగా పరమాసహ్యంతో క్రోధంతో ఆమెవైపు చూశాడు తాను. అప్పుడే తన అత్త పెద్దనోరుతో రంగప్రవేశం చేసింది. తనబిడ్డను ఏమన్నా అంటే పోలీసులకు పట్టిస్తానంది.

''గెట్..అవుట్. నీయింటికి నీవు వెళ్లిపో'' అంటూ తాను వీధిలో పడ్డాడు. రెండువేలు పెట్టి చీరకొన్నాడు. ఇంటికి వచ్చి ఆ చీరవిప్పి భార్యముందు ప్రదర్శించి, అన్నకూతురు పెళ్లికి వెడుతున్నానని చెప్పి, ఇంట్లో తినకుండానే బయటపడ్డాడు.

పెళ్లికూతురిని చేశాడు. ఆ మరుసటిరోజు పెళ్లిలో పాల్గొన్నాడు. తనకెవరూ పరిచయం లేరు. పెళ్లయిన వెంటనే చెప్పా చేయకుండా హైదరాబాదు వచ్చేశాడు.

• • •

తన ఇల్లు ఖాళీ. పక్కింటివారు తాళం చెవులు ఇచ్చారు. కుర్చీలు, సోఫాలు, పడకమంచం, టీవీసెట్టు అన్నీ గోవిందా!

అంతా అర్థమైపోయింది. తన భార్య, ఆర్నెల్లపాప తనను విడిచి వెళ్లిపోయారు. మహేశ్వరికి తనకన్నా తన తల్లిదండ్రులే ఎక్కువైపోయారు.

అయినాసరే ఆరోజు వస్తారేమో అని తాను ఎదురుచూశాడు. వచ్చేవారైతే వస్తువులన్నీ ఎందుకు తీసుకొనిపోతారు.

తన భార్యా వాళ్లదగ్గర తానెలాంటి కట్నకానుకలు తీసుకోలేదు. ఒక్కపడక మంచం మాత్రమే ఆమె తెచ్చుకొంది. అంతకుమించి వారిచ్చిన మరే వస్తువు ఈఇంటిలో లేదు.

• • •

తానీరోజు తన భార్యను పంపవలసిందని అత్తామామల నడగడానికి వచ్చాడు. మాటా మాటా పెరిగింది. తాను విడాకుల ప్రసక్తి తెచ్చాడు. తన పాపను కూడా వారు చూచుకోనివ్వలేదు. తన మీదికి చెప్పులేసారు, శాల్తీ గల్లంతయితది అంటున్నారు.

ఏంటిదంతా! తాను ఒంటరి. తల్లిదండ్రులు లేరు. అన్నాదమ్ములు లేరు. సహకరించే సహోద్యోగులు లేరు. ఏంటిదంతా! అన్నిటికీ కారణం- ఒక్కటే!

తనకు వెనకాముందెవ్వరూ లేరు.

• • •

క్రింద కూచున్నవాడల్లా, నీరసంగా నిస్సత్తువగా లేచి నిల్చున్నాడు. జవసత్త్వాలుడిగిపోయినవాడిలా గోడ ఆసరా చేసుకొని కుర్చీ పట్టుకొని కుర్చీలో కూచున్నాడు.

''మళ్లీ కూచుంటున్నావేంరా సిగ్గులేకుండా?'' అరిచింది అత్త.

ఎన్ని తిట్లు! ఎన్ని శాపనార్థాలు! సూర్యకాంతాన్ని తలదన్ని పుట్టింది అత్త రాజేశ్వరి అనిపించింది.

''చివరిసారిగా చెబుతున్నా వినుకో!'' అత్త అరిచింది.

''మా అమ్మాయి రాదు. అది రేపటినుండే మందుల కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. తన బతుకు తాను బతుకుతుంది. మాదగ్గరే ఉంటుంది. ఈ పాపను నీకివ్వం. విడాకుల కొరకు ప్రయత్నం చేస్తే కట్నం కొరకు హింసించావని పోలీసు కేసు పెట్టి బొక్కలో తోయిస్తాం. మక్కలిరుగతన్నిస్తాం. హోంమంత్రి పి.ఎ మా బంధువు. నీవు మా యింటివైపు కన్నెత్తి చూస్తే...ఇంతే సంగతులు.''


అత్త హెచ్చరిక. హెచ్చరిక కాదు...ఆడసింహ గర్జన.

తాను చివరిసారిగా తన భార్యవైపు చూశాడు. ఆమె చేయెత్తి ఇంటిబయటకు దారిచూపింది. తాను చివరిసారిగా తన పాపను చూడాలనుకొన్నాడు.

'ఒక్క అడుగు అటువైపు వేసినా శవమై పోతవు'' అత్త హుంకరించింది.

'కులం, మతం, వర్ణం, వర్గం, సమాజం, స్త్రీ, పురుషులు... అన్నిటికి అతీతంగా- ఒంటరిగా విశ్వమానవునిగా బతకాలనుకొన్న తాను... ఈ సంసారం రొంపిలోకి ఎందుకు దిగానురా'' అనుకొంటూ ఆ యిల్లు దాటి వీధినపడ్డాడు గిరిజానన్.

★



## థ్రిల్లింగ్

ఇరుగు పొరుగు ఆంటీలు సెన్సారు సంభాషణ లాడుతున్నారు.

''భర్త అనేవాడు...భార్యకి రోజూ ఒక క్రొత్త వ్యక్తిలా అనిపిస్తే..అబ్బ..కాపురం ఎంత థ్రిల్లింగో కదా!'' అంది ఓ ఆంటీ.

దానికన్నా..ప్రతిరోజూ ఒక క్రొత్త వ్యక్తే భర్తయితే మహా థ్రిల్లింగు కదండీ'' చెప్పింది రెండో ఆంటీ, ఊహల్లో తేలిపోతూ.

-అకనం మూర్తి (కాకినాడ)

## ఇంటి నిద్ర

''ఇంత లేటుగా వచ్చావేం?'' చిరాగ్గా అడిగాడు ఆఫీసర్.

''సారీ సార్. లేటుగా నిద్ర లేచాను'' చెప్పాడు వెంకట్.

''వాట్? నువ్వు ఇంటి దగ్గర కూడా నిద్రపోతావా?'' ఆశ్చర్యపోయాడు ఆఫీసర్.

## ఎట్రాక్షన్

''ఆషా, నువ్వూ కలిసి మెలిసి తిరిగారు కదా...మరి ఇప్పుడు విడిపోయారేం?'' అడిగింది రేఖ.

''అది నా ప్రక్కన వుంటే నావేపు ఎవరూ చూడ్డంలేదు'' రోషంగా చెప్పింది సుకుమారి.

## భయం

''ఆశ్చర్యంగా వుందే! ఈరోజు మగపిల్లలెవరూ కాలేజీకి రాలేదు'' అడిగాడు ప్రిన్సిపాల్.

''మరి ఈరోజు రాఖీ పూర్ణిమ కదండీ!'' గుర్తు చేశాడు తెలుగు లెక్చరర్.

-పి.వి.రమణకుమార్ (చిలకలూరిపేట)

